స్వయంపాలనా కెరటం కొండా లక్ష్మణ్ బాపూజీ

రాజీలేని పోరాటానికి ఆదర్శప్రాయుడు

లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): స్వాతంత్ర్య సమరయోధుడుగా, అనంతర కాలంలో తెలంగాణ స్వయంపాలన కోసం, ఆత్మగౌరవం కోసం పోరాటాలు నడిపిన తొలితరం ఉద్యమనేతగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి అజరామరమని బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. రాజకీయవేత్తగా తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు బాపూజీ నడిపిన రాజీలేని పోరాటాలు తెలంగాణ సోయి కలిగిన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కొనియాడారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. మంత్రి పదవిని త్యాగం చేసి నాటి తెలంగాణ వ్యతిరేకులకు సవాల్ విసిరిన బాపూజీ పట్టుదల తన మలిదశ రాష్ట్ర సాధన పోరాటానికి స్ఫూర్తి నింపిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, రక్షణ స్వరాష్ట్ర సాధనతోనే సాధ్యమని, తాను రాజీనామా చేసి ఉద్యమాన్ని ప్రారంభించిన నాడు బాపూజీ తనకు అండగా నిలిచిన సందర్భాన్ని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. స్వయంపాలన కోసం తాను తొలి అడుగు వేసిన జలదృశ్యం ఉద్యమ ప్రస్థానం నుంచి, స్వరాష్ట్రంగా నిలిపి పదేండ్ల బీఆర్ఎస్ పాలన సాధించిన ప్రగతి ప్రస్థానం చరిత్రాత్మక ఘట్టం అని పేర్కొన్నారు.

బడుగుల అభ్యున్నతే...

బడుగుబలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తన జీవితకాలం పోరాడిన బాపూజీ ఆకాంక్షలకు అనుగుణంగా పదేండ్ల పాలన కొనసాగిందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. బాపూజీ కృషిని భావితరాలకు నిత్య స్ఫూర్తిగా నిలిపేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం వారి ఆదర్శాలను కొనసాగించేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టిందని గుర్తుచేశారు. తెలంగాణ సబ్బండ కులాల ఆత్మగౌరవాన్ని కాపాడటం, అన్ని రంగాల్లో వారి హక్కులకు రక్షణ కల్పించడం, స్వయంపాలనలో వారిని భాగస్వామ్యులను చేయడమే కొండా లక్ష్మణ్ బాపూజీకి మనం అందించే ఘననివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

విషమిచ్చి చంపి ఇండ్లు కూల్చుండి

- మా శవాలను మూసీలో పారేయండి
- ఓట్లేసి గెలిపించింది ఇండ్లు కూల్చేందుకా?
- వివరాలు ఇవ్వం.. ఖాళీ చెయ్యం..!
- 'మూసీ' పొడవునా సర్వే అధికారులకు తేల్చిచెప్పిన స్థానికులు.. అడ్డగింత
- గుండెలు బాదుకుంటూ రోదిస్తూనే ప్రభుత్వంపై మహిళల శాపనార్థాలు
- 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు

కొత్తపేట జనప్రియ కాలనీలో హైడ్రా అధికారులు వేస్తున్న మార్కింగ్‌ను అడ్డుకుంటున్న స్థానికులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : మూసీ నదిలో ఆక్రమణలు అంటూ సర్వేకు వచ్చిన అధికారులపై ఒక్కసారిగా మహిళల్లో ఆగ్రహం పెల్లుబికింది. 'ఏండ్ల తరబడి ఉంటున్న ఇండ్లను ఉన్నపలంగా కూలుస్తామంటే చూస్తూ ఊరుకోవాలా' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. 'ఓట్లేసి గెలిపించింది మా ఇండ్లను కూలగొట్టించుకునేందుకా?' అని ఓ యువతి ఆక్రోశం వ్యక్తంచేస్తే.. 'మాకు విషమిచ్చి చంపి శవాలను మూసీలో పడేసిన తర్వాతే మా ఇండ్లు కూలగొట్టుండ్రి' అంటూ రామంతపూర్‌లోని కేసీఆర్ నగర్‌లో ఓ మహిళ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'పేదలకు ఇండ్లు ఇవ్వాల్సింది పోయి ఉన్న ఇండ్లను కూలగొట్టి మా జీవితాలనే కూల్చేయాలను కుంటున్నోని కుటుంబం బాగుంటదా? మా ఉసురు తగలకుండా పోతడా' అంటూ ఓ వృద్ధురాలు శాపనార్థాలు పెట్టింది. ఇలా ఒక్కరో ఇద్దరో కాదు.. మూసీ నది పొడవునా ఉన్న ఇండ్లలో నివాసముంటున్న వందలాది మంది, రేవంత్ సర్కారుపై దుమ్మెత్తిపోశారు. గురువారం మూసీ పరీవాహక ప్రాంతంలో మూడు జిల్లాల పరిధిలోని మండలలాకు చెందిన రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేతో ఒక్కసారిగా నిర్వాసితుల ఆక్రందనలు మిన్నంటాయి. అధికారుల బృందాలను చుట్టుముట్టి తమ గోడు వెల్లగక్కారు. డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా 'మా ఇండ్లను ఇట్లనే ఉంచండి తప్ప మాకు వేరే ఇండ్లే వద్దు' అంటూ కుండబద్దలు కొట్టారు.

నిరసనల మధ్యే సర్వే

ఓవైపు స్థానికుల నిరసనలు కొనసాగుతుండగానే గురువారం గ్రేటర్ పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ఇండ్లకు అధికారులు మార్కింగ్ చేశారు. పోలీస్, రెవెన్యూ, నీటిపారుదల సహా వివిధశాఖల అధికారుల ఆధ్వర్యంలో ఈ సర్వే ప్రక్రియ జరిగింది. అధికారులు సర్వేకు రాగానే వారంతా ఒక్కసారిగా అడ్డుకున్నారు. తమ ప్రాంతాల్లో సర్వే చేయొద్దంటూ మార్కింగ్ ప్రక్రియను ఆపే ప్రయత్నం చేశారు. తమ ఇండ్లు తొలగిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఒకదశలో సర్వే అధికారులను అడ్డుకునేందుకు స్థానికులు ప్రయత్నించడంతో ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్తత చోటుచేసుకున్నది. పలు చోట్ల అధికారుల కాళ్లావేళ్లాపడి బతిమిలాడుకున్నారు. కొందరు మహిలు మహిళా కానిస్టేబుళ్ల చేతులు పట్టుకొని ఏడుస్తూ దండం పెడుతూ తమ ఇండ్ల జోలికి రావద్దని వేడుకున్నారు. అయినా అధికారులు వినకపోవడంతో సర్వేను అడ్డుకున్నారు. ఇండ్ల వద్దకు వచ్చిన సర్వే అధికారులను మహిళలు అడ్డుకోవడంతో మహిళా కానిస్టేబుళ్లు వారిని పక్కకు లాక్కెళ్లే ప్రయత్నం చేసినా విడిపించుకుంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటివరకు ఎన్నిసార్లు వర్షాలు పడ్డా తమ ఇండ్ల వద్దకు చుక్క నీరు కూడా రాలేదని, రెవెన్యూ పట్టాలున్న తమ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ అని ఎట్లా డిసైడ్ చేస్తారని అధికారులతో వాగ్వాదానికి దిగారు.

సర్వేపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం

ఇక చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్‌లో మూసీనది బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలకు అధికారులు మార్కింగ్ చేశారు. బహదూర్‌పురా, కిషన్ బాగ్,అసద్‌బాబానగర్ తదితర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు పోలీసుల సాయంతో మార్కింగ్ చేశారు. లంగర్‌హౌస్ ఆశ్రంనగర్‌లో మార్కింగ్ ప్రక్రియను స్థానికులు అడ్డుకున్నారు. తాము అన్ని అనుమతులు తెచ్చుకొని కష్టపడి కట్టుకున్న ఇండ్లను కూల్చేయడమంటే తమ బతుకులతో ఆడుకోవడమేనని ఆవేదన వ్యక్తంచేశారు. చైతన్యపురి ఫణిగిరికాలనీ, న్యూ మారుతీనగర్, సత్యనగర్‌లో అధికారులతో వాగ్వాదానికి దిగారు. రివర్‌బెడ్‌లో ఉన్న ఇండ్ల వివరాలు, యజమానుల వివరాలను నమోదు చేసే పత్రాలను లాక్కొని ఆగ్రహంతో చింపివేశారు. మార్కింగ్‌కు ఉపయోగించే ఎరుపురంగును లాక్కున్న ఓ యువకుడు దూరంగా విసిరేశాడు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకున్నది. ఒక్కో బృందం 75 ఇండ్లను సందర్శించాల్సి ఉండగా ఉద్రిక్తల మధ్య సాధ్యం కాలేదు. అధికారులు అడిగిన సమాచారాన్ని ఇంటి యజమానులు ఇవ్వకుండా తిరస్కరించారు. తాము ఇక్కడి నుంచి వెళ్లే ప్రసక్తే లేదని అధికారులతో వాగ్వాదానికి దిగిన ఘటనలే అంతటా కనిపించాయి. ఉప్పల్‌లోని కేసీఆర్ నగర్, చైతన్యపురిలో సర్వే అధికారులను అడ్డుకున్నారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించినా వినకపోవడంతో కొన్ని ఇండ్లు తిరిగి వాటికి మార్కింగ్ చేసి మమ అనిపించారు.

26 బృందాలతో మార్కింగ్..

మూసీ విస్తరించిన మూడు జిల్లాలు రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు గురువారం ఏకకాలంలో సర్వే చేపట్టారు. రెవెన్యూ, పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులతో ఏర్పాటైన 26 బృందాలు మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఆక్రమణలను గుర్తించి మార్క్ చేశారు. హైదరాబాద్‌లో 16, రంగారెడ్డిలో 4, మేడ్చల్‌లో 5 బృందాలు మండలాల వారీగా పర్యటించాయి. మూసీ రివర్ బెడ్ ఏరియాలో నిర్మాణాలను అధికారులు గుర్తించి రిపోర్ట్ రెడీ చేశారు. హైదరాబాద్‌లో అంబర్‌పేట్, ఆసిఫ్‌నగర్, బహదూర్‌పుర, చార్మినార్, గోల్కొండ, హిమాయత్‌నగర్, నాంపల్లి, సైదాబాద్ మండలాలు, రంగారెడ్డిలో ఘట్‌కేసర్, మేడిపల్లి, ఉప్పల్, మేడ్చల్ జిల్లాలో అబ్దుల్లాపూర్‌మెట్, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లో కూల్చివేసే నిర్మాణాలను మార్క్ చేశారు. మూసీ నది వెంబడి రెవెన్యూ శాఖ నిర్వహించిన తాజా సర్వేలో రివర్ బెడ్ (నది గర్భం)లో 2,116 నిర్మాణాలు, బఫర్ జోన్‌లో మరో 7,850 నిర్మాణాలు ఉన్నాయని గుర్తించారు. హైదరాబాద్‌లో అధికారులు అంచనా వేసుకున్న 1,595 నిర్మాణాల్లో నిరసనల మధ్య 941 ఇండ్లకు మాత్రమే అధికారులు మార్క్ చేశారు. కాగా నేడూ కూడా సర్వే కొనసాగనుంది.

శనివారం నుంచే కూల్చివేతలు!

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా అక్రమణలను తొలగించేందుకు ఇప్పటికే హైడ్రా బుల్డోజర్లు మూసీ తీరానికి చేరుకున్నట్టు అధికారులు చెప్తున్నారు. శనివారం సాయంత్రం అంతా సిద్ధం చేసి ఆదివారం కూల్చివేయడానికి హైడ్రా ప్రణాళికలు చేసుకుంది. అందుకు సంబంధించి ఫోర్స్‌ను కూడా రెడీ చేసింది. ఎలాగైనా పెద్ద ఎత్తున వ్యతిరేకత ఉంటుందని ముందస్తుగానే హైడ్రా వద్ద సమాచారం ఉండటంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. మూసీ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బంది ఆ ప్రాంతాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. స్థానిక నాయకులతో చర్చిస్తూ ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు నది ఒడ్డున ఉన్న నివాసాల నుంచి ఖాళీ చేసే ప్రజలకు వసతి కల్పించేందుకు ప్రభుత్వం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పునరావాసం కల్పిస్తామని చెప్పినప్పటికీ వాటిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

మమ్ముల్ని సంపుండ్రి

నాపేరు లక్ష్మి.. నాకు ఒక్కటే ఇల్లున్నది. అది కూడా నలభై గజాలు.. ఈ ఇల్లు కూడా కూలగొడ్తమంటె ఆఫీసర్లు మామీద నుంచి పోయి కూలగొట్టాలే.. మమ్మల్ని చంపి కూలగొట్టుండ్రి. మాకు ఆస్తుల్లేవు. భూముల్లేవు. నాకు ఎప్పుడు హార్టెటాక్ వస్తదో తెల్వదు. మూడు మాట్ల కాల్లు చేతులు పడిపోయినయ్. నాకేమన్న అయిందనుకో రేవంత్‌రెడ్డే చేసిండని నా కొడుకులకు చెప్పి సచ్చిపోత. ఇగో.. రేవంత్‌రెడ్డీ చెప్తున్న.. నన్ను సంపి మూసీలో పారేసి నా ఇల్లు కూలగొట్టుండ్రి. రేవంత్‌రెడ్డి ఎందుకొచ్చిండు? మా ఇల్లు కూలగొట్టడానికి వాడెవ్వడు?

- లక్ష్మి, కేసీఆర్‌నగర్

కూలగొట్టినోడు బాగుపడ్తడా?

గవర్నమెంట్ జాగా తీసుకోవాలె.. కాల్వలు చేసుకోమను.. కానీ మా ఇండ్ల జోలికి ఎందుకు రావాలె. ఇక్కడి నుంచి మేమెక్కడికి పోవాలె. మా పిల్లల కాలేజీలు, స్కూల్లు అన్నీ వదిలేయాల్నా. ఒక్క ఇల్లు కూలగొట్టినా అందరం సచ్చిపోతం. ఈ రేవంత్‌రెడ్డి ఎప్పటికీ అన్యాయం చేస్తనే ఉంటడా. మేమైతే చెప్తున్నం..మా చావుకు రేవంత్‌రెడ్డే కారణమైతడు. ఆయనవల్లే మాకు ఈ కష్టం. మల్లోసారి వస్తడా.. మళ్ల ఓట్లేస్తమా. మా ఇండ్లు కూలగొట్టినోడు బాగుపడ్తడా. జనాల నోళ్లు కొట్టిన వాడు సంతోషంగా ఉంటడా. మేం మాత్రం ఊరుకోం. మాకు న్యాయం జరగాలె.

-నాగవాణి, కేసీఆర్‌నగర్

లోకం పోకడ

మామూలు కంపే బాగుంది..
ఈ అవినీతి కంపు భరించలేకపోతున్నాం!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.7°c	24.5°c
రంగారెడ్డి	34.1°c	22.1°c
మెదక్	33.2°c	22.3°c
ఖమ్మం	33.0°c	24.0°c
నిజామాబాద్	32.6°c	24.7°c
కరీంనగర్	31.0°c	26.0°c
వరంగల్	31.0°c	25.0°c
నల్లగొండ	30.0°c	23.0°c
హైదరాబాద్	28.0°c	23.0°c
మహబూబ్‌నగర్	28.0°c	21.0°c

హైడ్రాతో పేదలకు ఇబ్బందులు లేవు: మంత్రి సీతక్క

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): హైడ్రాతో పేదలకు ఇబ్బందులు లేవని, ఇండ్లు కోల్పోయే పేదలకు మరో చోట డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారని మంత్రి సీతక్క తెలిపారు. అమృత్ పథకంలో ఏమైనా తప్పిదాలు జరిగితే కేంద్రమే చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. గురువారం పెసా జాతీయ సదస్సులో పాల్గొన్న అనంతరం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో తనను కలిసిన మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సీతక్క సమాధానమిచ్చారు. రేవంత్‌రెడ్డి బంధువు అయినందునే సృజన్‌రెడ్డికి అమృత్ టెండర్లు దక్కాయన్న విమర్శలు సరికావని చెప్పారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగలేదన్న కారణంతో గ్రామ పంచాయతీలకు కేంద్రం నిలిపివేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ సహాయ మంత్రి ఎస్పీసింగ్ బఘేల్‌ను సీతక్క కోరారు.

హైడ్రా కూల్చివేతలు చట్టబద్ధంగా ఉండాలి

సీఎంకు బహిరంగలేఖలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): హైడ్రా కూల్చివేతలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా చేపట్టి ఉంటే బాగుండేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆక్రమణలను, అక్రమ నిర్మాణాలను తాము సమర్థించబోమని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. హైడ్రా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా కూల్చివేతలు కొనసాగిస్తున్నదని ఆరోపించారు. హడావుడి చేసి నిత్యం వార్తల్లో ఉండే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతలను ఎంచుకున్నట్టు కనిపిస్తున్నదని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు అప్పులు చేసి, బ్యాంకు రుణాలు తీసుకొని స్థలాలు, ఫ్లాట్లు కొనుక్కున్నారని, వారి కట్టడాలు కూల్చివేసి బజారున పడేస్తే వారు ఎటుపోవాలని ప్రశ్నించారు. తప్పుడు లేఅవుట్‌లు సృష్టించి ప్రజలను మభ్యపెట్టి, పెట్టుబడులు పెట్టించి, అక్రమంగా భూములు అమ్మిన వారిని దీనికి బాధ్యులను చేస్తూ కఠినమైన చట్టాలు తీసుకురావాలని సూచించారు.

హెచ్ఎండీఏలో ఎన్వోసీ గుబులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏ ప్లానింగ్ అధికారవర్గాల్లో ఎన్వోసీ గుబులు మొదలైంది. ఇరిగేషన్ ఇతర శాఖలు ఇచ్చిన ఎన్వోసీలను ప్రామాణికంగా తీసుకొని నిర్మాణ అనుమతుల జారీ ప్రకియ పలు జోన్ల పరిధిలో జోరుగా సాగింది. లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్లానింగ్, హైడ్రా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎన్వోసీ ఆధారంగా జారీ చేసిన అనుమతులను పునఃపరిశీలన చేయాలని నిర్ణయించారు. ఇది ప్లానింగ్ విభాగంలోని సిబ్బందిని హడలెత్తిస్తున్నది. బిల్డింగ్ పర్మిషన్ల పునఃపరిశీలనతో అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నది. అదే జరిగితే ప్లానింగ్ విభాగంలో ఎన్వోసీ ఆధారంగా జరిగిన లావాదేవీలన్నీ బట్టబయలు కానున్నాయి. హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలో జరిగిన ఎన్నో అవకతవకలకు అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడమే కారణమని పలు సందర్భాల్లో వెల్లడైంది. అధికారుల నిర్లక్ష్యంతోనే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల్లో నిర్మాణాలు భారీగా జరిగాయి. ఇరిగేషన్‌శాఖ ఇచ్చిన ఎన్వోసీ, హెచ్ఎండీఏ బిల్డింగ్ పర్మిషన్ ఉన్న భవనాలనూ హైడ్రా కూల్చివేయడంతో పలు విమర్శలు వచ్చాయి. పర్మిషన్లు ఉన్న భవనాలను ఎలా కూలుస్తారని బాధితులు కోర్టులకు ఎక్కుతున్నారు. ఈ క్రమంలో కూల్చివేతలను పకడ్బందీగా నిర్వహించేందుకు హెచ్ఎండీఏ ప్లానింగ్, హైడ్రా అధికారులతో లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించింది.

సూర్యాపేట పట్టణం నెహ్రూనగర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

సర్వేకొస్తే కండ్లల్లో కారం కొడుతాం

- సూర్యాపేటలో సర్కారు 'హైడ్రా'మా
- సద్దుల చెరువు పరిసర నివాసాల్లో సర్వే
- తిట్లు, ఎదురుదాడితో అధికారుల పీచేముడ్

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 26: కొద్ది రోజులుగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు, పుల్లారెడ్డి చెరువు సమీపంలో ఉన్న నివాసులకు హైడ్రా గుబులు పుట్టిస్తున్నది. చెరువు పరిధిలోని ఇండ్లు కూల్చేస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గురువారం రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు సద్దుల చెరువు ప్రాంతంలో ఇండ్ల వివరాలు తెలుసుకునేందుకు వచ్చారు. దీంతో ప్రజల నుంచి పెద్ద ఎత్తున తిరుగుబాటు ఎదురైంది. 'ఏం మార్కింగ్ వేస్తుండ్రు.. కండ్లల్లో కారం పోసి కొడుతం.. ఒక్కో ఇంట్లో నాలుగు నాలుగు కుటుంబాలున్నాయి. రోడ్డు మీద బతకాలా? మేమొచ్చి 40 ఏండ్లు దాటింది.. మా ఇండ్లకు పట్టాలు కూడా ఉన్నాయి. అప్పుడు చెరువే లేదు. నాయకులు గేమ్‌లు ఆడుతూ జనాలను పిచ్చోళ్లను చేస్తుండ్రు. మీరు.. జేసీబీ తెచ్చి ఈడ పెట్టుండ్రి.. ఒక్కొక్క నా కొడుకును నరకకుంటే అడుగు.. కడుపుల మండుతుంది.. ' అని అక్కడి జనం ఆగ్రహ వ్యక్తంచేశారు. ఇలా తిట్లు, శాపనార్థాలు పెట్టడంతో చేసేదేమి లేక అధికారులు వెనుదిరిగిపోయారు. సూర్యాపేట ఆర్డీవో ఆదేశాల మేరకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఇండ్లను సర్వే చేసేందుకు సద్దుల చెరువు సమీపంలోని నెహ్రూనగర్‌కు వచ్చినట్టు ఇరిగేషన్ ఏఈ భూక్యా పాండునాయక్ తెలిపారు.

పుస్తకాలు కూడా తీసుకోనివ్వరా?: ఎన్ఆర్ఐ తిరుపతిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తేతెలంగాణ): 'ప్రభుత్వం హైడ్రా పేరిట హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టిస్తున్నది. రియల్ ఎస్టేట్ వాళ్ల దగ్గర డబ్బులు తీసుకొని పేదల ఇండ్లను కూలగొడుతున్నది' అంటూ ఎన్ఆర్ఐ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి చిటపటలాడారు. ఈ మేరకు గురువారం వీడియో విడుదల చేశారు. ' అమీన్‌పూర్ దగ్గర కట్టుకున్న తన ఇంటిని కూలగొడుతుంటే ఒడిశా నుంచి వచ్చిన పెద్దాయన ఏడుపు చూసి మీకు బాధనిపించలేదా? ఓ పాప కనీసం పుస్తకాలు, వాటర్ బాటిళ్లు తీసుకోనివ్వలేదంటూ చెప్తుంటే మీ మనసు కరగలేదా? అనుమతులిచ్చిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోరు? పెద్దోళ్ల అక్రమ కట్టడాలను విడిచిపెట్టి పేదోళ్లవి మాత్రం పడగొడుతున్నరు. దమ్ముంటే కూల్చుడు కాదు.. కట్టి చూపాలె' అని పేర్కొన్నారు.

ఇక జిల్లాల్లోనూ కూల్చుడే!

- పాలమూరు తరహా కూల్చివేతలకు చర్యలు
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, సర్కార్ భూముల్లో నిర్మాణాల తొలగింపునకు ఆదేశాలు
- రెవెన్యూ అధికారులకు బాధ్యతలు
- హైడ్రా తరహా బృందాలను రెడీ చేయాలని సూచన

సిద్దిపేట పట్టణంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్26(నమస్తే తెలంగాణ): ఇప్పటిదాకా హైదరాబాద్ నగరంలో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు అంటూ హైడ్రా పేరిట కూల్చివేతల కాండ సాగించిన కాంగ్రెస్ సర్కార్, ఇక జిల్లాల్లోనూ బుల్డోజర్లు పెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. పాలమూరు జిల్లా క్రిస్టియన్‌పల్లి తరహాలో మరిన్ని కూల్చివేతలకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు సమాచారం. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, ప్రభుత్వ భూముల్లో ఉన్న భవనాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయలని కలెక్టర్లకు ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. కూల్చివేతలకు రెవెన్యూ అధికారులు నాయకత్వం వహించాలని, హైడ్రా తరహా బృందాలను లీడ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పలు జిల్లాల్లో కూల్చివేతలు మొదలయ్యాయి.

సిద్దిపేటలో మొదలైన కూల్చివేతలు

గురువారం తెల్లవారుజామున సిద్దిపేట జిల్లా కేంద్రంలో రెండు ఇండ్లను అధికారులు కూల్చివేశారు. ఎర్రచెరువు బఫర్ జోన్‌లో ఉన్నదని ఒక ఇంటిని, మున్సిపల్ అనుమతి లేదని మరో ఇంటిని రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు కూల్చి వేశారు. ఎర్ర చెరువు సమీపంలో ఓ వ్యక్తి ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నాడు. అతడి ఇల్లు బఫర్ జోన్‌లో ఉన్నదంటూ రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. మరో ఐదు కుటుంబాలకు నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది. పట్టణం 5వ వార్డులో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అనుమతి పొంది ఇల్లు కడుతున్నారనే ఆరోపణతో మరో ఇంటిని కూలగొట్టారు. మున్సిపాలిటీ అనుమతి లేకుండా, అనుమతించిన ప్లాన్ ప్రకారం లేకుండా కట్టిన ఇండ్లను అక్రమ నిర్మాణాలుగానే గుర్తించి కూల్చి వేస్తామని మున్సిపాలిటీ అధికారులు హెచ్చరించారు. గతేడాది ఆగస్టు 23 తర్వాత సిద్దిపేట పట్టణంలో 58, 59 జీవోల కింద పట్టాలిచ్చిన దాదాపు 200కు పైగా ఇంటి స్థలాలకు రీ వెరిఫికేషన్ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. సంగారెడ్డి జిల్లాలోనూ రెవెన్యూ అధికారులు ఓఇంటిని కూల్చేశారు. కొండాపూర్ మండలం మల్కాపూరంలో నర్సింహులు అనే వ్యక్తి భవనం కట్టుకున్నాడు. దానికి గ్రామ పంచాయతీ అనుమతించింది. కాగా పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి భవనం కట్టాడన్న కారణంతో కూల్చేశారు.

దివ్యాంగుల ఇండ్లపై విరుచుకుపడి..

గత ఆగస్ట్ చివరి వారంలో మహబూబ్‌నగర్ పట్టణంలో భారీగా కూల్చివేతల కాండ కొనసాగింది. పొద్దంతా కష్టం చేసిన ప్రజలు ఆదమరిచి నిద్రపోతున్న వేళ క్రిస్టియన్‌పల్లిమీద రెవెన్యూ అధికారులు బుల్డోజర్లతో విరుచుకుపడ్డారు. 75 ఇండ్లను తెల్లవారేలోపు నేలమట్టం చేశారు. బాధితుల్లో బదిరులు, అంధులు, దివ్యాంగులే ఎక్కువగా ఉన్నారు. రెవెన్యూ అధికారులే 2007లో ఇవే ఇండ్లకు పట్టాలిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక వారికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి, నీటి సౌకర్యం కల్పించింది. ఇవేవీ పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు దివ్యాంగుల ఇండ్లను కూలగొట్టారు. ఈ నెల మొదటి వారంలో రంగారెడ్డి జిల్లా రాయదుర్గం మండలం మల్కం చెరువు వద్ద 40 ఇండ్లను శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఇక్కడి పేదలు చెరువుకు దూరంగా ఇండ్లు కట్టుకొని 40 ఏళ్ల నుంచి ఉంటున్నరు. అర్ధరాత్రి వేళ ఆ ఇండ్లను నేలమట్టం చేశారు. కానీ ఇదే చెరువును ఆక్రమించి జాతీయ స్థాయిలో పేరున్న రియల్ ఎస్టేట్ సంస్థలు ఆకాశహర్మ్యాలు నిర్మించాయి. ఏకంగా మల్కం చెరువునే ఆక్రమించి బహుళ అంతస్థుల భవనాలు కట్టాయి. కానీ రెవెన్యూ అధికారులు వాటివైపు కన్నెత్తి చూడకుండా పేదల ఇండ్లను కూలగొట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చెరువులో భవనం కూల్చివేత

గతంలో 'నమస్తే తెలంగాణ'లో కథనం • విచారణ జరిపించిన కలెక్టర్

పేలుడు పదార్థాలతో విధ్వంసం • హోంగార్డు గోపాల్‌కు స్వల్ప గాయం

కొండాపూర్, సెప్టెంబర్ 26 : ఓ వ్యక్తి ఏకంగా చెరువులో నిర్మించిన భవనాన్ని గురువారం అధికారులు కూల్చివేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్నది. కొండాపూర్ మండలం మల్కాపూర్ మధిర గ్రామం కుతుబ్‌షాయిపేటలోని మల్కాపూర్ పెద్ద చెరువులో పటాన్‌చెరుకు చెందిన నర్సింలు అనే వ్యక్తి 2011లో మూడు ఎకరాలు కొనుగోలు చేశాడు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే 2012లో నాలా కన్వర్షన్ చేసుకొని 250 గజాల విస్తీర్ణంలో జీ+2 భవనాన్ని నిర్మించాడు. అది ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదని గతంలో 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అప్పట్లో ఆ భవన యజమాని కోర్టు స్టే తీసుకువచ్చినట్టు ప్రచారం జరిగింది. దీంతో ఆ నిర్మాణం అలాగే ఉండిపోయింది. విషయం సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి దృష్టికి రావడంతో విచారణకు ఆదేశించారు. కొండాపూర్ మండల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించి ఈ నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నదని తేల్చి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. భవనాన్ని కూల్చివేయాలని అధికారులు సదరు భవన యజమానికి వారం రోజుల క్రితం నోటీసులు జారీచేసినా స్పందించలేదు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య భవనాన్ని తహసీల్దార్ ఎస్తేరు అనిత, ఇతర అధికారులతో కలిసి పేలుడు పదార్థాలతో కూల్చివేశారు. ఈ క్రమంలో భవన శకలం తగలడంతో ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు గోపాల్ తలకు గాయమైంది. అక్కడే ఉన్న అధికారులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. తన భవనం ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్లు తెలియదని అన్నారు. తాను నిర్మాణం చేపట్టినప్పుడు నీళ్లు లేవని చెప్పాడు. ఎఫ్‌టీఎల్‌లో భవన నిర్మాణాలకు అనమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ తీరువల్ల తనకు రూ.6 కోట్లకుపైగా నష్టం వాటిలినట్టు వాపోయాడు.

• కూల్చడానికి ముందు

• కూల్చిన తర్వాత